సాక్షి అన్నమయ్య జిల్లా

శనివారం, 5, ఏప్రిల్, 2025



వైభవంగా ముగిసిన జాతర

రాజంపేటలోని బలిజపల్లె గ్రామంలో జరిగిన గంగమ్మ జాతర వేడుకలు ముగిశాయి. శుక్రవారం అమ్మవారి ప్రతిమను భక్తులు ఊరేగిస్తూ పొలిమేర్లకు తరలించారు. -8లో



వేధింపులతోనే రైతు ఆత్మహత్య

నాయకుల వేధింపులు, రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతోనే మా నాన్న ఆత్మహత్య చేసుకున్నాడని, మా కుటుంబాన్ని ఆదుకొని న్యాయం చేయాలని బాధితులు కోరారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.100	రూ.126
రెండోరకం	రూ.60	రూ.90

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 140 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

మెగా డీఎస్సీకి ఆన్‌లైన్‌లో శిక్షణ

రాయచోటి టౌన్‌: మెగా డీఎస్సీకి ఆన్‌లోలైన్లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నారు. ఇందుకోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ అధికారి సురేష్‌ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టెట్‌ క్వాలిఫై అయిన అభ్యర్థులు..ఈబీసీకి చెందిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హులైన అభ్యర్థులు రాయచోటి బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తులు పొంది అక్కడే సమర్పించాలని చెప్పారు. ఆన్‌లైన్‌ తరగతులు ఎప్పటి నుంచి ప్రారంభమవుతాయనే వివరాలు అదే కార్యాలయంలో తెలుసుకోవచ్చని తెలిపారు.

12న అరుణాచలానికి ప్రత్యేక బస్సు

రాయచోటి అర్బన్‌: విశ్వావసు నామ సంవత్సరం చైత్రపౌర్ణమి సందర్భంగా ఈనెల 12వతేదీన రాయచోటి నుంచి అరుణాచలం వెళ్లేందుకు ప్రత్యేక బస్సు సర్వీసును నడుపుతున్నట్లు డీఎం ధనుంజయ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సు ఉదయం 11.45 నిముషాలకు పట్టణంలోని బంగ్లాస్టాప్‌ వద్ద బయలుదేరుతుందన్నారు. టికెట్‌ ధర రూ.1050గా నిర్ణయించినట్లు తెలిపారు. ప్రయాణీలకుల సౌకర్యార్థం ఎయిర్‌ సస్పెన్షన్‌, పుష్‌బ్యాక్‌సీట్లు, ప్రతిసీటుకు సెల్‌చార్జర్‌ వసతులు ఉన్న అధునాతన బీఎస్‌6 అల్ట్రా డీలక్స్‌ బస్సు నడుపుతున్నట్లు చెప్పారు.ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

8న డీడీఆర్‌సీ సమావేశం



మాట్లాడుతున్న జేసీ ఆదర్శ రాజేంద్రన్‌

రాయచోటి: ఈనెల 8న జిల్లా ఇన్‌చార్జ్‌ మంత్రి జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో డీడీఆర్‌సీ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా జాయింట్‌ కలెక్టర్‌ ఆదర్శ రాజేంద్రన్‌ తెలిపారు. శుక్రవారం ఉదయం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌ హాల్‌లో అధికారులతో జరిగిన సమావేశంలో జేసీ మాట్లాడుతూ జిల్లా అధికారులు వారి శాఖలకు సంబంధించిన పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై సీపీఓకు అందించిన సమగ్ర నివేదికలను క్లుప్తంగా, సులభంగా అర్థం చేసుకునే విధంగా మార్పులు చేసి అందజేయాలని తెలిపారు.కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థి దాతృత్వం



లక్ష రూపాయల చెక్కును అందజేస్తున్న బాదుషా సాహెబ్‌

పెనగలూరు: మండల కేంద్రమైన పెనగలూరు జిల్లా పరిషత్‌ హైస్కూల్‌లో సైకిల్‌ స్టాండ్‌ కోసం 1969 పదోతరగతి బ్యాచ్‌కు చెందిన పి బాదుషా సాహెబ్‌ అనే పూర్వ విద్యార్థి లక్ష రూపాయల చెక్కును పాఠశాల ప్రధానోపాధ్యాడు మధుసూదన్‌ రెడ్డికి శుక్రవారం అందజేశారు. రిటైర్డ్‌ డిప్యూటీ కంజర్వేటర్‌ ఫారెస్ట్‌కు చెందిన ఈయన తాను చదివిన పాఠశాలకు గుర్తింపుగా ఉండాలని ఈ నగదును వితరణగా అందజేసినట్లు తెలిపారు. తల్లిదండ్రుల జ్ఞాపకార్థం పదోతరగతిలో మెరిట్‌ విద్యార్థులకు ప్రతి ఏడాది జనవరి 26వ తేదీన ఆర్థిక సహాయం కూడా అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్‌రెడ్డి, బీవీ రాఘవరెడ్డి, పి.ఎల్లయ్య, శ్రీనివాసులు, రవి, సీఆర్‌పీ బాదుషా తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన



రైతులతో మాట్లాడుతున్న అధికారులు

రైల్వేకోడూరు అర్బన్‌: రెండు రోజుల క్రితం కురిసిన వర్షం, ఈదురు గాలుల బీభత్సంతో దెబ్బతిన్న పంటలను శుక్రవారం జిల్లా ఉద్యానశాఖాధికారి టి రవిచంద్రబాబు పరిశీలించారు. మండలంలోని అనంతరాజుపేట,బొజ్జవారిపల్లి, రాఘవరాజుపురం, ఉర్లగడ్డపోడు, బయనపల్లి, కేసీ అగ్రహారం, ఉప్పరపల్లి గ్రామాల్లో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో దెబ్బతిన్న ఉద్యానశాఖ పంటలను పరిశీలించి నివేదికలు ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు.అంచనా ప్రకారం మండలంలో 52 ఎకరాల్లో అరటి పంటకు నష్టం వాటిల్లిందని, 31 మంది రైతులకు నష్టం వాటిల్లిందని తెలిపారు. కార్యక్రమంలో మండల ఉద్యానశాఖ అధికారులు ఎం భాస్కర్‌, ఆసియా తదితరులు పాల్గొన్నారు.

కళ్లు తెరవండి.. కరువు చూడండి


- కరువు మండలాల ప్రకటనలో అన్యాయం
- 30 మండలాలకు మొండిచేయి
- అన్నదాతకు నిరాశ



శ్రీనివాసపురం రిజర్వాయర్‌లో అడుగంటుతున్న జలాలు



చిన్నమండెం మండలంలో అడుగంటిన జలాలతో కనిపిస్తున్న మేకమాను చెరువు



రాయచోటి: ప్రభుత్వం ప్రకటించిన కరువు ప్రాంతాల జాబితాలో అన్నమయ్య జిల్లాకు చోటు దక్కక పోవడం రైతులను తీవ్ర నిరాశకు గురిచేసింది. నిజానికి గత జూన్‌ నుంచి ఇప్పటి వరకు వర్షపాతం పరిశీలిస్తే జిల్లా వ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు కొనసాగుతున్నాయి. జిల్లాలో 3272 చెరువులు ఉన్నాయి. దాదాపు 70 శాతం చెరువులు ఎండిపోయాయి. రిజర్వాయర్లలో సైతం నీళ్లు రోజు రోజుకు అడుగంటిపోతున్నాయి. భూగర్భ జలాలు పూర్తిగా పడిపోయాయి. దీంతో వరి, వేరుశనగ పాలాలతో కళకళలాడుతూ కనిపించాల్సిన చెరువులు, రిజర్వాయర్ల కింద ఆయకట్టు భూములన్నీ బీడుగా మారాయి. పాపాఘ్ని, బహుదా, పింఛా, చెయ్యేరు, మాండవ్య, వెలిగల్లు నదుల పరీవాహక ప్రాంతాల్లో సైతం పంటలు సాగు కావడం లేదు. ఆయాచోట్ల కూడా వరిపంట సాగు చేయొద్దని ఇరిగేషన్‌ అధికారులు సూచిస్తుండటం పరిస్థితి తీవ్రతను చాటుతోంది.

- కూటమి ప్రభుత్వం కరువు రైతుకు తీవ్ర అన్యాయం చేసింది. గతేడాది ఖరీఫ్‌లో తీవ్ర వర్షాభావం వెంటాడింది. వాన జాడలేక పంటలు ఎండిపోయాయి. పశుగ్రాసం కూడా దక్కలేదు. ఆ ప్రభావం రబీపై కూడా పడింది. మండే ఎండలతో భూగర్భ జలమట్టం పడిపోయింది. బోరుబావులు ఉన్నఫలంగా ఎండిపోయాయి. పంటలను కాపాడుకునేందుకు అన్నదాతలు పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు. కొంత మంది రైతులు చేసేది లేక పంటలను వదిలేసుకుని సర్వం నష్టపోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఖరీఫ్‌, రబీ నష్టాలతో కోలుకోలేని స్థితిలో ఉన్న అన్నదాతను ఆదుకోవాల్సిన కూటమి ప్రభుత్వం అన్యాయమే చేసింది. ఖరీఫ్‌ సీజన్లో జిల్లాలో 19 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించినా ప్రభుత్వం నుంచి రైతుకు దక్కిన పరిహారం శూన్యం. కేంద్ర కరువు బృందం వచ్చి వెళ్లినా ఫలితం లేకుండా పోయింది. అందులో జిల్లాలో వేరుశనగ, మరికొన్ని పంటలకు మాత్రమే నష్టం వాటిల్లిందని పేర్కొన్నట్లు సమాచారం. రబీ సీజన్‌లో జిల్లాలో 30 మండలాల రైతులకు అన్యాయం చేశారు. రబీ ముగిసినా నష్టపరిహారం దక్కలేదు. జిల్లాలో ఇప్పటికే 116 గ్రామాల్లో తాగునీటి ఎద్దడి కారణంగా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 5 వేల పంప్‌ సెట్లు ఉండగా అందులో 1500 పంపు సెట్లకు మరమ్మతులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

రైతు ప్రభుత్వమంటే ఇదేనా..

వ్యవసాయమే జిల్లా ప్రజలకు ప్రధాన జీవనాధారం. గత ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితులు వెంటాడాయి. రబీలో కూడా ఈశాన్య రుతుపవనాలు బలహీనపడటంతో వానజాడ కరువైంది. దీంతో భూగర్భ జలమట్టం పడిపోయి, పంటలు ఎండిపోయి రైతన్నలకు అప్పులే మిగిలాయి. 2024–25లో రబీ సీజన్‌లో జిల్లా అంతటా కరువు ఛాయలు అలుముకున్నా వాస్తవ పరిస్థితులను పక్కన పెట్టి జిల్లాను కరువు మండలంగా ప్రకటించకపోవడం దారుణమని విమర్శలు వినిపిస్తున్నాయి. కరువు మండలాల ప్రకటనలో ప్రభుత్వానికి తామేం పాపం చేశామని జిల్లా రైతులు వాపోతున్నారు. పంట సాగు విస్తీర్ణం, దిగుబడి, వర్షపాతం నమోదు భూమిలో తేమశాతం, భూగర్భ జలమట్టం తదితర అంశాలపై కేంద్ర మార్గదర్శకాలకు అనుగుణంగా కరువు మండలాలను ఎంపిక చేస్తారు. రైతు ప్రభుత్వం అని చెప్పుకున్న కూటమి పాలకులు.. వారికే అన్యాయం చేశారు. . జిల్లా యంత్రాంగం క్షేత్రస్థాయిలో కరువు పరిస్థితులను పరిశీలించకుండానే ప్రభుత్వం చెప్పినట్లు కంటితుడుపుగా నివేదికలు సిద్ధం చేసినట్లు విమర్శలు ఉన్నాయి. కరువు ప్రాంతాల జాబితాలో చోటు లభిస్తే ఆయా మండలాల్లో పంట రుణాల రీషెడ్యూల్‌, పంట నష్టపరిహారం, తాగునీటికి నిధులు, ఉపాధి కల్పన తదితర కరువు సహాయక చర్యలకు అవకాశం ఉంటుంది. ఈ ఏడాది మార్చి ఆఖరుకు రబీ ముగిసింది. అప్పట్లో జిల్లా వ్యాప్తంగా ఎండిపోయిన పంట పొలాలు కనిపించేవి. రబీ సీజన్‌ ముగిసి మూడు నెలలు దాటింది. ప్రస్తుతం ఎండలు దంచి కొడుతున్నాయి. గ్రామాల్లో తాగునీటికి కూడా కటకటలాడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.



ఎండిపోతున్న మామిడిచెట్లకు నీటిని అందించేందుకు సిద్ధంగా ఉంచిన ట్యాంకర్లు

అన్నదాతలను ఆదుకోవాలి



రాయచోటి ప్రాంతంలో లక్షలాది రూపాయలు అప్పులు చేసి 1000 అడుగులు, 1500 అడుగులు బోర్లు వేసినా చుక్కనీరు పడటంలేదు. అయినా ఇక్కడి రైతుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యధోరణితో వ్యవహరిస్తోంది. ఈ ప్రాంతంలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి అన్నదాతలను ఆదుకోవాలి. లేనిపక్షంలో రైతులతో కలిసి నిరసన కార్యక్రమాలు చేపడతాం. – ఎండపల్లి బాలకష్టారెడ్డి, రైతు సంఘం రాయచోటి ఏరియా ప్రధాన కార్యదర్శి

సహాయక చర్యలు చేపట్టాలి



జిల్లాలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో నీటి ఎద్దడి నెలకొంది. రాయచోటి మండలం మాధవరం గ్రామంలో వ్యవసాయ బావుల్లో నీరు అడుగంటిపోయాయి. వాటి కింద సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయి. జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి కరువు సహాయక చర్యలు చేపట్టాలి. – వైవీ శివయ్య, వెనుకబడిన ప్రాంతాల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు

మార్గదర్శకాలకు అనుగుణంగానే..



కరువు జిల్లాల ప్రకటనలో ప్రభుత్వం మార్గదర్శకాలను అనుసరిస్తుంది. రబీ సీజన్‌లో నమోదైన వర్షపాతం ఆధారంగా నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించి ప్రస్తుతం కరువు మండలాలను ప్రకటించలేదు. జిల్లాకు సంబంధించిన వర్షపాతం నమోదు వివరాలను ప్రభుత్వానికి పంపాం. వేసవిలో మామిడి పూత రాలిపోవడంపై నివేదికలు ప్రభుత్వానికి పంపుతాం. – చామకూరి శ్రీధర్‌, జిల్లా కలెక్టర్‌

ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలకు నేడు అంకురార్పణ

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఏప్రిల్‌ 6వ తేదీ నుంచి 14 వరకు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 వరకు అంకురార్పణ శాస్త్రోక్తంగా నిర్వహిచనున్నారు. ఈ సందర్భంగా సీతారామ లక్ష్మణ ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి ఆశీనులు చేస్తారు. అనంతరం టీటీడీ పాంచరాత్ర ఆగమ సలహాదారు రాజేష్‌ కుమార్‌ ఆగమ శాస్త్రం ప్రకారం అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఆలయంలోని పుట్టమన్నును యాగశాలకు తీసుకెళ్లే కార్యక్రమంతో అంకుకార్పణ ముగుస్తుంది.

రేపు ధ్వజారోహణం: ఏప్రిల్‌ 6న ధ్వజారోహణంతో శ్రీ కోదండరామస్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉదయం 9.30 నుంచి 10.15 గంటల మధ్య వృషభ లగ్నంలో ధ్వజారోహణం, రాత్రి 7 నుండి 9 వరకు శేష వాహనసేవ జరగనున్నాయి.



భక్తులకోసం ఏర్పాటు చేసిన చలువపందిళ్లు

- ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీటీడీ ఏర్పాట్లు చేపట్టింది. ఆలయంలో ప్రత్యేక క్యూలైన్లు, చలువ పందిళ్ల ఏర్పాటు చేశారు. గోపురాలు, కల్యాణ వేదిక, ఇతర ప్రాంతాల్లో విద్యుత్‌దీపాలు అమర్చారు.

పటిష్ట ఏర్పాట్లు: శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలకు పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టనున్నట్లు కడప జిల్లా జాయింట్‌ కలెక్టర్‌ అదితి సింగ్‌ తెలిపారు. శుక్రవారం ఒంటిమిట్టలో జరుగుతున్న ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. అనంతరం టీటీడీ పరిపాలన భవనంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలన్నారు. అంతకుముందు ఒంటిమిట్ట సీఐ బాబు బ్రహ్మోత్సవాల బందోబస్తుపై ఎస్‌ఐ శివప్రసాద్‌తో కలిసి పోలీసు సిబ్బందితో సమావేశం నిర్వహించారు.వాహనాల పార్కింగ్‌,క్యూలైన్‌ తదితర అంశాలపై చర్చించారు.

నవమి వేడుకలకు రామాలయాలు ముస్తాబు

రాయచోటి: ఈనెల 6వ తేదీన శ్రీరామ నవమి వేడుకలను నిర్వహించేందుకు జిల్లాలోని రామాలయాలను నిర్వాహకులు ముస్తాబు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జిల్లా పోలీసు యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఇప్పటికే జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న రామాలయాలు, నిర్వాహకుల వివరాలను సేకరించారు. శ్రీరామ నవమి వేడుకలను ప్రజలందరూ ప్రశాంతంగా జరుపుకోవాలని నిర్వాహకులకు స్థానిక పోలీసులు సూచనలు చేస్తున్నారు. ముఖ్యంగా రాయచోటి, మదనపల్లె, రాజంపేట పట్టణాల్లో రామాలయం వద్ద ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ ప్రత్యేక సిబ్బందితో నిఘా వ్యవస్థ ఏర్పాటు చేశారు. సమస్యాత్మక ప్రాంతాల్లో డ్రోన్‌ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు.



శ్రీరామ నవమి వేడుకలకు ముస్తాబైన వాల్మీకిపురంలోని రామాలయం

కవి సమ్మేళనం

ఒంటిమిట్ట: కోదండరామస్వామి వారి ఆలయంలో శ్రీరామ నవమి పర్వదినం, శ్రీ పోతన జయంతిని పురస్కరించుకొని కవిసమ్మేళనం జరగనుంది. టీటీడీ హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ఏప్రిల్‌ 6వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుంది.

అయ్యో... ఆంధ్రావాల్మీకి!

భద్రాచలం రామయ్య కోసం గుడి నిర్మించి రామభక్తుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు రామదాసు.. అదే తరహాలో ఒంటిమిట్ట కోదండరాముని ఆలయ జీర్ణోద్ధరణ కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మరో రామదాసు వావికొలను సుబ్బారావు. అయితే వావికొలనును తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పట్టించుకోవడం లేదని భక్తులు ఆరోపిస్తున్నారు. ఒంటిమిట్ట కోదండ రామస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల నేపథ్యంలో రామభక్తుడైన వావికొలను సుబ్బారావు సేవలపై కథనం.

- వావికొలను సుబ్బారావుపై టీటీడీ నిర్లక్ష్యం
- గుట్టకే పరిమితమైన అపర రామదాసు ఖ్యాతి
- టీటీడీ తీరుపై భక్తుల ఆవేదన



వావికొలను కు సీతారామలక్ష్మణలు ప్రత్యక్షమైనట్లుగా ఊహాచిత్రం



ఆంధ్రావాల్మీకి వావికొలను సుబ్బారావు

ఒంటిమిట్ట(రాజంపేట): భద్రాచలంలో రామయ్య గుడి కట్టించిన భక్తరామదాసు కీర్తి ప్రతిష్టలు తెలంగాణా ప్రభుత్వం ఇనుమడింప చేసే విధంగా ముందుకెళుతోంది..ఆంధ్రప్రదేశ్‌ ప్రభుత్వం మాత్రం అధికారిక రామాలయం నిర్మాణానికి సూత్రధారి అయిన అపరరామదాసు, ఆంధ్రవాల్మీకిగా ప్రసిద్ధికెక్కిన వావికొలను సుబ్బారావు గురించి పట్టించుకోవడం లేదు.టీటీడీ వావికొలను సుబ్బారావు కీర్తి ప్రతిష్టలు ప్రాచుర్యంలోకి తీసుకొచ్చేందుకు ఎటువంటి అడుగువేయలేదన్న ఆరోపణలు ఉన్నాయి. సుబ్బారావు బోటు(గుట్ట)ను టీటీడీ అభివృద్ధి చేయలేదు. ఇటీవల ఒంటిమిట్టకు వచ్చిన ప్రభుత్వ బృందం దృష్టికి వావికొలను అంశం వెళ్లినట్లు తెలిసింది.

వావికొలను జీవితమిలా..

ఆంధ్రావాల్మీకి వావికొలను సుబ్బారావు జనవరి 23, 1863న ప్రొద్దుటూరులో జన్మించారు. తండ్రి రామచంద్ర, తల్లి కనకమ్మ, భార్య రంగనాయకమ్మ. 1883లో ప్రొద్దుటూరు తాలుకా ఆఫీసులో గుమస్తాగా చేరి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొంది 1896 వరకు పనిచేశారు. ఆగస్టు1, 1936లో మద్రాసులో పరమపదించారు.

టెంకాయచిప్పను చేతిలో ధరించి..

రాజులు ఆలయానికి ఇచ్చిన వందలాది ఎకరాల మాన్యాలు ఎవరికివారు భోంచేశారు. దీంతో ఒంటిమిట్ట రామయ్యకు నైవేద్యం కూడా పెట్టలేని స్థితికి ఆలయం వచ్చింది. ఈ నేపథ్యంలో ఆలయాన్ని ఉద్ధరించడానికి వావికొలను కంకణం కట్టుకున్నారు. టెంకాయచిప్పను చేతపట్టుకొని ఆంధ్రప్రదేశ్‌లో ఊరురా తిరిగి బిచ్చమెత్తారు. వచ్చిన ధనంతో రామాలయాన్ని పునరుద్ధరించారు. టెంకాయ చిప్పలో ఎంత డబ్బు పడినా.. ఏదీ ఉంచుకోలేదు. అంతా ఆలయ అభివృద్ధికే ఇచ్చారు. అలాగే రామాయణంతోపాటు శ్రీకృష్ణలీలామృతం, ద్విపద భగవద్గీత, ఆంధ్రవిజయం, దండకత్రయం, టెంకాయ చిప్పశతకం లాంటి ఎన్నో రచనలు కూడా వావికొలను చేశారు.

వానప్రస్థం

1920లో మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో తెలుగుపండితునిగా పనిచేశారు. వైరాగ్యపూరితుడై భోగమయ జీవితాన్ని త్యజించి గోచి ధరించి రామునికోసం ఒంటిమిట్టలో ఏళ్ల తరబడి తపస్సు చేశారు. కాని ఊరిలో కొందరు స్వార్థపరులు కుళ్లు రాజకీయాలతో ఆయన్ను అవమానించారు.ఆలయంలోకి రానివ్వకుండా చేశారు.ఊరిలో నిలువలేని పరిస్థితులును కల్పించారు. వావికొలను దుఖించి, ఆ ఊరిని వీడి. మొదట గుంటూరు జిల్లా నడిగడ్డపాలెంలోనూ,అంగలకుదురులో తన ఆశ్రమాన్ని స్థాపించుకుని అక్కడే ఉన్నారు. ఈయన మొదలుపెట్టిన గురుంపరంపర నేటికి కొనసాగుతోంది.

ఆంధ్రావాల్మీకిగా..


సుబ్బారావు వాల్మీకి సంస్కృత రామాయణాన్ని 24వేల చందోభరిత పద్యాలుగా తెలుగులో రాశారు. వాల్మీకి రామాయణాన్ని (24000 శ్లోకాలను)108సార్లు పారాయణం చేయటం వల్ల ఆయనకు అందులోని నిగూఢ అర్థాలు స్ఫురించాయి. ఆయన రాసిన రామాయణాన్ని మహాసభమద్యలో ఒంటిమిట్ట రామాలయంలో శ్రీరామునికి అంకితం ఇచ్చాడు. అప్పుడు బళ్లారి రాఘవ అధ్యక్షతన జరిగిన సభలో మహాపండితులు ఆయనకు ఆంధ్రవాల్మీకి అని బిరుదు ప్రదానం చేశారు.

శృంగిశైలాన్ని అభివృద్ధి చేయాలి



రామాలయం నిర్మాణం కోసం తన సర్వస్వాన్ని కోల్పోయిన వావి కొలను సుబ్బారావుకు స్మారక మందిరం నిర్మించాలి. ఆయన నివసించిన శృంగిశైలం (సుబ్బారావుబోటు)ను అభివృద్ధి చేయాలి. – గానుగపెంట హనుమంతరావు, సాహితీవేత్త, కడప

వావికొలను సుబ్బారావును టీటీడీ మరవరాదు



ఆంధ్రవాల్మీకి సుబ్బారావు గురించి టీటీడీ మరవరాదు. ఆయన నివాసం ఉన్న గుట్ట అభివృద్ధికి నోచుకోలేదు. ఆయన పేరుతో ప్రాజెక్టు ఏర్పాటు చేసి ప్రాచుర్యం కల్పించాలి. –ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి, మాజీ డైరెక్టర్‌, గిద్దంగులశాఖ కార్పొరేషన్‌, ఒంటిమిట్ట

నేడు ఒంటిమిట్టలో టీటీడీ అధికారులతో సమావేశం

కడప సెవెన్‌రోడ్స్‌: శ్రీరామ నవమి పర్వదిన సందర్భంగా ఒంటిమిటలో జరగనున్న బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై శనివారం మధ్యాహ్నం అక్కడి టీటీడీ భవనంలో అధికారులతో సమావేశం నిర్వహిస్తుంచనున్నారు. ఈ విషయాన్ని డీఆర్వో విశ్వేశ్వరనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు తిరుమల–తిరుపతి దేవస్థానం ఈఓ, ఇతర అధికారులు సమావేశంలో పాల్గొంటారన్నారు. కనుక జిల్లాలోని ఇందుకు సంబంధించిన వివిధ శాఖల అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం



గ్రామస్తులతో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి నాగరాజు

సిద్దవటం: పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులను దూరం చేయవచ్చని జిల్లా వైద్యాధికారి డాక్టర్‌ నాగరాజు తెలిపారు. సిద్దవటం మండలం లోని మాధవరం–1 గ్రామంలో శుక్రవారం జరుగుతున్న ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉందని, వృద్ధులు, బాలింతలు, చిన్నపిల్లలు బయట తిరుగొద్దని సూచించారు. ప్రస్తుతం జరిగే ఎన్‌సీడీ–సీడీ సర్వే, ఏబీబీఏ(అభా)జనరేషన్‌, ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన పథకాలకు ఈ–కేవైసీ చేయించాలని వైద్య సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో మాధవరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్‌ శివకుమార్‌, సూపర్‌వైజర్లు నాగవల్లి, జ్యోతి ,రమణయ్య, ఏఎన్‌ఎంలు పద్మావతి, ఉమా, ఆశా వర్కర్‌లు సుజాత, అదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వేధింపులతోనే రైతు ఆత్మహత్య

- న్యాయం కోసం బాధిత కుటుంబం వేడుకోలు
- సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత
- అండగా నిలిచిన మాజీ సైనిక సంక్షేమ సంఘం



సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు, మాజీ సైనికులు

మదనపల్లె : స్థానిక నాయకుల వేధింపులు, రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతోనే మా నాన్న ఆత్మహత్య చేసుకున్నాడని, మా కుటుంబాన్ని ఆదుకొని న్యాయం చేయాలని బాధితులు కోరారు. వాల్మీకిపురం మండలం టీకులకోన వద్ద గురువారం తెల్లవారుజామున ఆత్మహత్య చేసుకున్న రైతు వెంకటాద్రి కుమారుడు యువరాజు, కుమార్తె మీనా మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్‌ను ఆశ్రయించారు. మాజీ సైనికుల సంఘం ఆధ్వర్యంలో వారు సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. తమ తాత లక్ష్మయ్య సైనికుడిగా పని చేసి పదవీ విరమణ చేయడంతో 1975లో.. వాల్మీకిపురం మండలం మూరేవాండ్లపల్లె గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 1051 లో 5.51 ఎకరాల భూమి ప్రభుత్వం ఇచ్చిందన్నారు. స్థానికుల ఆక్రమణలతో కేవలం రెండు ఎకరాలు మాత్రమే తమకు మిగిలిందని, ఆ భూమిపై ఆధారపడి జీవిస్తున్నామని ఫిర్యాదులో తెలిపారు. తాత లక్ష్మయ్య మృతి చెందడంతో సదరు భూమిని తమ తండ్రి వెంకటాద్రి తన పేరుపై ముటేషన్ చేయాల్సిందిగా తహసీల్దార్ పాములేటి, వీఆర్వో వెంకటేశ్వర్‌రెడ్డిలను ఆశ్రయించినా వారు నిర్లక్ష్యం చూపారన్నారు. స్థానిక నాయకులు నారాయణరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మదనారెడ్డి తాము సాగు చేసుకుంటున్న భూమిపై వివాదం సృష్టించారన్నారు. తహసీల్దార్ పామిలేటి వారికే వత్తాసు పలకడంతో, తీవ్ర మనస్తాపానికి గురైన తమ తండ్రి వెంకటాద్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని సబ్ కలెక్టర్ ముందు ఆవేదన వ్యక్తం చేశారు. ఆత్మహత్యకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ స్పందిస్తూ.. ఇలాంటి ఘటన చాలా దురదృష్టకరమని, మీ కుటుంబానికి తప్పకుండా న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ప్రస్తుతం మీరు సాగు చేసుకుంటున్న భూమి కుంట పోరంబోకుగా ఉందని, నిబంధనల ప్రకారం పట్టా ఇవ్వడం కుదరదని చెప్పారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. సాగుకై ప్రత్యామ్నాయ భూమిని గుర్తించి ఇస్తామన్నారు. మీ కుటుంబానికి అన్యాయం జరగకుండా భూమి అందజేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుని, భూ కేటాయింపుకు అర్హులుగా గుర్తిస్తూ ప్రభుత్వానికి సిఫారసు చేస్తామన్నారు. ఆత్మహత్య ఘటనపై క్షేత్రస్థాయిలో పూర్తి విచారణ చేసి బాధితులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సైనికుల సంఘం అధ్యక్షులు కంచర్ల శ్రీనివాసులు నాయుడు, మాజీ సైనికులు మదన్మోహన్ రెడ్డి, సిపాయి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ వివరణ

కలికిరి(వాల్మీకిపురం) : రైతు ఆత్మహత్యపై స్పందించిన తహసీల్దారు పామిలేటి ప్రకటన విడుదల చేశారు. బాధితుడు వెంకటాద్రి తనకు పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేయాలని పీజీఆర్ఎస్‌లో దరఖాస్తు చేసి ఉండటం జరిగిందని, పరిశీలించిన మునుపటి రెవెన్యూ అధికారులు తాటిగుంటపల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 1051 రెవెన్యూ రికార్డుల మేరకు కుంట పొరంబోకు భూమిగా ఉండటంతో పట్టా ఇవ్వడం కుదరదని ఎండార్స్‌మెంట్ ఇవ్వడం జరిగిందన్నారు. అయితే భవిష్యత్తులో అసైన్‌మెంట్ కమిటీలకు మృతుడి కుటుంబం దరఖాస్తు ఉంచి, అప్పటి ప్రభుత్వ నింబంధనలు, కుటుంబ అర్హత మేరకు దరఖాస్తు పట్టా మంజూరుకు చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.

ఆరుగురిపై కేసు నమోదు

రైతు వెంకటాద్రి ఆత్మహత్యపై పూర్తి స్థాయి నివేదిక ఇవ్వాలని ఉన్నతాధికారులు తహసీల్దారు పామిలేటిని ఆదేశించారు. కాగా మృతుని కుమారుడు సి.యువరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెద్దవంకపల్లికి చెందిన నారాయణరెడ్డి, వెంకట్రామిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ఏపీటీయుఎస్ హోమ్ లోన్స్ పీలేరు బ్రాంచ్ మేనేజరు మణికంఠ, తహసీల్దారు పామిలేటిపై కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.

క్లుప్తంగా

స్కూటీపై స్టంట్ చేసిన ఇద్దరు అరెస్ట్



నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

రాయచోటి : స్కూటీపై స్టంట్స్ చేసిన ఇద్దరు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. గురువారం సాయంత్రం పట్టణంలోని రాయచోటి–మదనపల్లి మార్గంలో.. స్కూటీపై ఇద్దరు యువకులు వేగంగా, నిర్లక్ష్యంగా స్టంట్‌లు చేస్తూ హల్‌చల్ చేశారు. ఈ సంఘటనపై సోషల్ మీడియాతోపాటు సాక్షి పత్రికలో కథనం రావడంతో అర్బన్ సీఐ బీవీ చలపతి స్పందించారు. ఆ ఇద్దరు యువకులను అరెస్టు చేశారు. స్కూటీని స్వాధీనం చేసుకొని బైకు ఓనర్‌పై కేసు నమోదు చేశారు. ఇద్దరు యువకులపై కేసు నమోదు చేసి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకున్నట్లు సీఐ తెలిపారు. డ్రైవింగ్ లైసెన్సు పొందని యువకులకు బండి ఇచ్చిన యజమానిని కూడా కేసులో నిందితుడిగా చేర్చడం జరిగిందని పేర్కొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



పీలేరు రూరల్ : పీలేరు పట్టణ శివారు ప్రాంతం కడప రోడ్డు మార్గంలో ఓ గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు సీఐ యుగంధర్ తెలిపారు. వివరాలిలా వున్నాయి. స్థానిక కడప రోడ్డు మార్గంలో వైన్ షాపు సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున 12.40 గంటల సమయంలో 35–40 మధ్య వయస్సు గల వ్యక్తి మృతి చెంది ఉండగా స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడు ఎవరైంది ఆచూకీ తెలియరాలేదని సీఐ తెలిపారు. కుడిచేతి మనుకట్టుకు ఎర్రదారం కట్టుకని, కడియం కలిగి ఉన్నాడని, మృతుడి వివరాలు తెలిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు.

నియామకం



ఎం.చంద్రశేఖర్

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండలం బొజ్జవారిపల్లికి చెందిన మజ్జిగ చంద్రశేఖర్ వెంకటరామగూడెం ఉద్యాన విశ్వవిద్యాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులుగా ఏకగ్రీవంగా శుక్రవారం ఎంపికయ్యారు. కోడూరు మండలానికి చెందిన వ్యక్తి రాష్ట్ర స్థాయి యూనివర్సిటీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులుగా ఎంపిక కావడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు. అలాగే ఉపాధ్యక్షులుగా వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా శివశంకర్ తదితరులు ఎంపికయ్యారు.

న్యాయం చేయాలని ఆందోళన



రోడ్డుపై బైఠాయించిన మాజీ సైనికులు

కలికిరి(వాల్మీకిపురం) : విశ్రాంత మిలటరీ ఉద్యోగి సి.లక్ష్మయ్య కుమారుడు వెంకట్రాది ఆత్మహత్యపై అతని కుటుంబానికి న్యాయం చేయాలని మదనపల్లి ఎక్స్ సర్వీస్‌మెన్ అసోషియేషన్ ఆధ్వర్యంలో మాజీ సైనిక ఉద్యోగులు శుక్రవారం ఉదయం వాల్మీకిపురంలో రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. విశ్రాంత మిలటరీ ఉద్యోగికి కేటాయించిన భూమి ఆక్రమణకు గురైనా రెవెన్యూ అధికారులు పట్టించుకోక పోవడం దారుణమన్నారు. మృతున్ని కుటుంబానికి న్యాయం చేయాలని నినదించారు. హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ధర్నా విరమింపచేశారు. అనంతరం మాజీ సైనికోద్యోగులు మృతుని కుటుంబ సభ్యులతో కలిసి ఉన్నతాధికారులను కలిసి విన్నవించినట్లు సమాచారం. వాల్మీకిపురం ప్రభుత్వాసుపత్రిలో వున్న వెంకటాద్రి మృతదేహానికి పోస్టుమార్టం పూర్తి చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. స్వగ్రామంలో అంత్యక్రియలు పూర్తి చేశారు.

వేలాడుతున్న యమపాశాలు

బాలుడికి గాయాలు



గాయపడ్డ బాలుడు



ఇంటిపై చేతికందే ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలు

కలికిరి : సాధారణంగా ఎక్కడైనా విద్యుత్ లైన్ కిందికి సాగిపోతే ట్రాన్స్‌కో అధికారులు వెంటనే సరి చేస్తారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు సైతం తీసుకుంటారు. అయితే ఓ ఇంటిపైన విద్యుత్ తీగలు చిన్నారులకు సైతం అందే ఎత్తులో ఉండి.. ఓ చిన్నారి గాయాలపాలైనా ట్రాన్స్ అధికారులకు విద్యుత్ తీగలు మార్చాలనే కనికరం కలుగలేదు. మండలంలోని మర్రికుంటపల్లి గ్రామం పాత దళితవాడకు చెందిన ఎం.మణికుమార్ నివాసంపైన చేతికి సునాయాసంగా అందే ఎత్తులోనే విద్యుత్ లైన్ వుంది. విద్యుత్ వైరు ప్రమాదకరంగా ఉందని, మిద్దె మీదికి వెళ్లాలన్నా ఇబ్బందిగా ఉందని పలుమార్లు ట్రాన్స్‌కో సిబ్బందికి, అధికారులకు ఆయన మొరపెట్టుకున్నాడు. వారం రోజుల క్రితం ఆయన కుమారుడు మిద్దెమీదికి వెళ్లడంతో విద్యుత్ లైన్ తగిలి గాయాలపాలయ్యాడు. పెనుప్రమాదం నుంచి త్రుటిలో తప్పించుకున్నాడు. గాయపడ్డ కుమారుడిని చూపించి అధికారులు చర్యలు తీసుకోవాలని విన్నవించడంతో ట్రాన్స్‌కో సిబ్బంది లైన్ మార్చారు. అయితే ట్రాన్స్‌కో ఏఈ ముజీబుర్ రెహ్మాన్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసి విద్యుత్ లైన్ పక్కకు మార్చకూడదని, ఉన్నది ఉన్నట్లే ఉంచాలని హుకుం జారీ చేశాడు. దీంతో అవాక్కయిన సిబ్బంది చేసేది లేక తిరిగి యథావిధిగా వదిలేశారు. ఉన్నతాధికారులు స్పందించి విత్యుత్ లైన్ మార్చాలని బాధిత కుటుంబం కోరుతోంది.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్ట్



హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్టు చూపుతున్న టూ టౌన్ పోలీసులు

మదనపల్లె : ఓ వ్యక్తి మరో ఇద్దరు వ్యక్తులపై కత్తులతో దాడికి పాల్పడిన హత్యాయత్నం కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు టూ టౌన్ సీఐ రామచంద్ర తెలిపారు. ఘటనకు సంబంధించిన వివరాలను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వెల్లడించారు. పట్టణంలోని రామ్ నగర్‌లో నివాసం ఉన్న బట్ట మరి సురేందర్‌రెడ్డి అలియాస్ సురేంద్రబాబు(42), ఈనెల ఒకటో తేదీ (మంగళవారం రాత్రి) భోజనం తరువాత స్థానికంగా ఉన్న పార్కు వద్ద వాకింగ్ చేస్తుండగా.. కలికిరి మండలం పొట్టేకులవారి పల్లెకు చెంది, ప్రస్తుతం పట్టణంలోని సుభాష్ రోడ్డులో నివాసం ఉన్న ఓబుల్‌రెడ్డి కుమారుడు వేణుగోపాల్‌రెడ్డి మద్యం తాగి ద్విచక్ర వాహనంలో రామ్ నగర్ ప్రాంతానికి వెళ్లి, వాకింగ్ చేస్తున్న సురేందర్ రెడ్డిపై ఆకస్మాత్తుగా కత్తులతో దాడి చేశాడు. అదే ప్రాంతానికి చెందిన శ్రీనివాసులు దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించగా అతనిపై కూడా కత్తులతో దాడికి పాల్పడడంతో, ఇద్దరికీ తీవ్ర గాయాలు అయ్యాయి. గమనించిన స్థానికులు బాధితులు ఇద్దరిని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. వీరిలో శ్రీనివాసులు పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. సురేందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు క్రైమ్ నెంబర్ :53/2025, అండర్ సెక్షన్109(1) బీఎన్ఎస్ కింద కేసు నమోదు చేసి ఎస్సై రహీముల్లా కేసు దర్యాప్తు చేశారు. బాధితుడు సురేందర్‌రెడ్డి నిందితుడైన వేణుగోపాల్‌రెడ్డి భార్యతో వివాహేతర సంబంధం కలిగి ఉన్నాడన్న అనుమానంతో ఎలాగైనా సురేందర్‌రెడ్డిని అంతమొందించాలని.. వేణుగోపాల్‌రెడ్డి హత్యాయత్నానికి పాల్పడ్డాడని నిర్ధారించారు. కోమిటివాని చెరువు వద్ద వేణుగోపాల్‌రెడ్డిని అరెస్టు చేసి, అతని వద్ద నుంచి హత్యాయత్నం ఘటనకు ఉపయోగించిన ద్విచక్ర వాహనాన్ని రెండు కత్తులను, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎస్సై రహీముల్లా, ఏఎస్ఐ వెంకటరమణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మానవ సమాజంలో ఫార్మసీదే కీలక పాత్ర



మాట్లాడుతున్న అన్నమాచార్య యూనివర్సిటీ చాన్స్‌లర్ చొప్పా గంగిరెడ్డి

రాజంపేట : నేటి మానవ సమాజంలో ఫార్మసీ రంగానిదే ప్రముఖపాత్ర అని అన్నమాచార్య యూనివర్సిటీ చాన్స్‌లర్ చొప్పా గంగిరెడ్డి అన్నారు. శుక్రవారం అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో బీఫార్మసీ విద్యార్థులు వీడ్కోల సభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మసీ రంగం సమాజంతో పూర్తి స్థాయిలో ముడిపడి వుందన్నారు. నేటి పరిస్థితులలో మెడిసిన్ వాడకం అధికంగా ఉందన్నారు. అలాగే ఫార్మసీ విద్యకు డిమాండ్ ఉందన్నారు. దేశ, విదేశాలలో ఫార్మసీ విద్యతో ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. ఇప్పటికే అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో విద్యను అభ్యసించిన వారు అనేక మంది దేశ, విదేశాలలో ఉద్యోగాలు చేస్తున్నారని తెలిపారు. వైస్‌చాన్స్‌లర్ సాయిబాబారెడ్డి మాట్లాడుతూ ఫార్మసీ విద్యను కష్టంగా కాకుండా ఇష్టపడి చదివితే విజయాలను దరిచేర్చుకోవచ్చునన్నారు. ఉన్నత విద్యను చేపట్టాలంటే క్రమశిక్షణ, పట్టుదల ఎంతైనా ముఖ్యమన్నారు. ప్రిన్సిపాల్ స్వర్ణలత మాట్లాడుతూ ఫార్మసీ రంగంలో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని, వాటిని విద్యను పూర్తి చేసిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. పలువురు విద్యార్థులకు చొప్పా చేతుల మీదుగా జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీఎస్ వైస్ చైర్మన్ చొప్పాఎల్లారెడ్డి, ఫార్మసీ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

మదనపల్లె : రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం అర్ధరాత్రి మదనపల్లె బైపాస్ రోడ్డులో జరిగింది. రాత్రి గుర్తు తెలియని వ్యక్తి బసినికొండ పంచాయితీ మదనపల్లి బైపాస్ రోడ్డు షిరిడి సాయిబాబా ఆలయ సమీపంలో రోడ్డు పక్కన నడిచి వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. గమనించిన స్థానికులు బాధితుడిని స్థానిక ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గుర్తు తెలియని వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. కాగా మృతి చెందిన వ్యక్తి సుమారు 50– 55 మధ్య వయసు కలిగి ఉన్నాడు. చామన చాయ రంగుతోపాటు ఎడమ భుజంపై రత్నమ్మ అనే పేరు పచ్చబొట్టుగా ఉంది. నీలిరంగు టీ షర్టు ధరించి ఉండగా దానిపై ఎస్ఆర్ఎం యూనివర్సిటీ అని ఉంది. నేవీ బ్లూ రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతుని ఆచూకీ తెలిసినవారు మదనపల్లె తాలూకా పోలీస్ స్టేషన్ సిఐ కళా వెంకటరమణ ఫోన్ నెంబర్ :9440796742, ఎస్సై చంద్రమోహన్ ఫోన్ నెంబర్:9440796743. ఎస్సై గాయత్రి ఫోన్ నెంబర్ :8712626235లలో సంప్రదించాలన్నారు.

కళాశాలల్లో పీడీ పోస్టులు మళ్లించడం దారుణం

గుర్రంకొండ : ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో ఫిజికల్ డైరెక్టర్ పోస్టులను ప్రభుత్వం మళ్లించడం దారుణమని జిల్లా పీఈటీల సంఘం అధ్యక్షుడు చింతిర్ల రమేష్‌బాబు అన్నారు. శుక్రవారం గుర్రంకొండలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో జూనియర్ లెక్చరర్(వ్యాయామవిద్య) పోస్టుల మార్పిడిని ప్రభుత్వం పెద్ద ఎత్తున చేపట్టడంతో అర్హులైన పీడీలకు అన్యాయం జరుగుతోందన్నారు. ఒక జోన్‌లో ఇప్పటికే 75 పోస్టులు, రాష్ట్ర వ్యాప్తంగా 200 జూనియర్ కళాశాల పీడీ పోస్టులను ఇతర సబ్జెక్టులకు మార్పిడి చేశారని అన్నారు. నిబంధనల మేరకు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పీడీ పోస్టులను జెడ్పీ హైస్కూళ్లలో పని చేసే పీడీలతో ప్రమోషన్ల ద్వారా భర్తీ చేయాల్సి ఉందన్నారు. గత ప్రభుత్వాలు కూడా ఇలా చేశాయన్నారు. ఏకీకృత సర్వీసు రూల్స్ అడ్డం పెట్టుకొని ఇటీవల ఉద్యోగోన్నతులు నిలిపివేశారన్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత విద్యలో విద్యార్థులకు వ్యాయామ విద్య లభిస్తుండగా ఇంటర్మీడియెట్ విద్యలో మాత్రం పీడీ పోస్టులు భర్తీ చేయకపోవడంతో విద్యార్థులకు అందడం లేదన్నారు. కావున ప్రస్తుత ప్రభుత్వం ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు పీడీలను మళ్లిస్తుండడం తగదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇంటర్మీడియెట్ విద్యలో పీడీ పోస్టులను కొనసాగించాలని అన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల సర్వేకు రాజకీయ గ్రహణం

- అనాధీనం భూముల సర్వేకు అధికారుల యత్నం
- అడ్డుకున్న అధికార పార్టీ నేతలు



ప్రభుత్వ భూమికి సరిహద్దును నిర్ణయించి కందకాలు తవ్వుతున్న పనులు సగంలో నిలిచిపోయిన దృశ్యం

గుర్రంకొండ : ప్రభుత్వ భూముల సర్వేకు రాజక్రీయ గ్రహణం పట్టుకొంది. రూ.1.50 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములను సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులను.. అధికార పార్టీ నేతలు అడ్డుకొని పంపించి వేసిన సంఘటన గుర్రంకొండలో జరిగింది. పట్టణానికి సమీపంలోని చిట్టిబోయనపల్లె రెవెన్యూ గ్రామం ఎన్‌హెచ్ 340 జాతీయ రహదారికి ఇరువైపులా ఉంది. ఇందులో ఒక్క సెంటు కూడా రైత్వారీ పట్టాగల భూములు లేక పోగా సుమారు 1800 ఎకరాలు మాన్యం భూములు ఉన్నాయి. ఇందులో 385 మంది రైతులు భూములు సాగు చేసుకొంటున్నారు. 2004లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో మాన్యం భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని, అక్కడ భూములు సాగు చేసుకొంటున్న రైతులకు ఎనిమిది విడతలుగా భూపంపిణీ కింద పట్టాలను పంపిణీ చేసింది. ఇవికాక ఇంకా పట్టాలు పంపిణీ చేయనివి, అనాధీనంలో ఉన్న భూములు ఎన్నో ఉన్నాయి. ఈ నేపథ్యంలో 2013 సంవత్సరంలో ఇ.సుజాతకు సర్వే నెంబరు 87/7లో 1.60 ఎకరాల భూమికి పట్టా ఇవ్వవలసిందిగా జిల్లా అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయమై పలుమార్లు సుజాత రెవెన్యూ అధికారులకు రెవెన్యూ సదస్సుల్లో అర్జీలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో స్థానిక రెవెన్యూ అధికారులు సదరు సర్వే నెంబరును సర్వే చేయడానికి వెళ్లారు. అయితే సదరు సర్వే నెంబరుతోపాటు ఇంకా వేరే నెంబర్లలో కూడా అనాధీనం భూములు ఉన్నట్లు గుర్తించారు. సుమారు 4.60 ఎకరాల మేరకు ఆ పరిసరాల్లో అనాధీన భూములు ఉన్నట్లు సర్వేలో తేల్చి సరిహద్దులను జేసీబీతో కందకాలు తవ్వించే పని ప్రారంభించారు. అయితే చిట్టిబోయనపల్లెకు చెందిన కొంతమంది అధికార పార్టీ నేతలు అక్కడికి చేరుకొని పెద్ద ఎత్తున హంగామా సృష్టించారు. తమ అనుమతి లేకుండా ఎలా సర్వేచేస్తారని ఇక్కడి భూములు అన్ని తమ స్వానుభవంలో ఉన్నాయని పేర్కొంటూ జేసీబీ పనులు అడ్డుకొన్నారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు తాము ఇక్కడి వచ్చి అనాధీన భూములను సర్వే చేస్తున్నామని కింది స్థాయి రెవెన్యూ అధికారులు సమాధానమిచ్చారు. అయినా సంతృప్తి చెందని నాయకులు సర్వే పనులను పూర్తి స్థాయిలో అడ్డుకొని నిలిపివేయించి జేసీబీని, రెవెన్యూ అధికారులను అక్కడి నుంచి పంపించి వేశారు. దీంతో చేసేదిలేక అధికారులు వెనుదిరిగి వెళ్లిపోవడం గమనార్హం.

సీమ వాసులపై చంద్రబాబుది కపటప్రేమ

- రాయచోటి అభివృద్ధిలో శ్రీకాంత్‌రెడ్డి పాత్ర అమోఘం
- వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి విజయభాస్కర్



మాట్లాడుతున్న వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి విజయభాస్కర్

రాయచోటి అర్బన్ : రాయలసీమ వాసులపై చంద్రబాబు మొదటి నుంచి కపటప్రేమను ప్రదర్శిస్తున్నారని వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి శిబ్యాల విజయభాస్కర్ విమర్శించారు. అన్నమయ్య జిల్లా ఏర్పాటై 3 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వైఎస్ఆర్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని విధాలుగా వెనుకబడిన రాయచోటిని అన్నమయ్య జిల్లా కేంద్రంగా చేయడంలో అప్పటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి కృషి ఎంతో ఉందన్నారు. రాష్ట్ర విభజనతో నష్టపోయినప్పటికీ మాజీ సీఎం జగనన్న ఎన్నోకష్టాలు పడుతూ ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందిస్తుంటే.. ప్రతిపక్ష నేతలు రాష్ట్రం మరో శ్రీలంకలా మారుతుందంటూ తప్పుడు ప్రచారం చేశారన్నా రు. 2019–24 మధ్య కాలంలో శ్రీకాంత్‌రెడ్డి కృషి కారణంగా కోట్లాది రూపాయల ఖర్చుతో నిర్మించిన పోలీస్ పరేడ్ గ్రౌండ్, ఆర్టీసీ బస్టాండు విస్తరణ, మున్సిపల్ సభాభవనం, రైతు బజార్ భవనాలు, వందపడకల ఆసుపత్రి, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నిర్మాణం, టీటీడీ కల్యాణ మండపం, ఎంపీడీఓ కార్యాలయ భవనం, స్టేట్ గెస్ట్‌హౌస్, డీఎస్పీ కార్యాలయం, స్టేడియం తదితరాలను అందుబాటులో తేవడం జరిగిందన్నారు. మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి జిల్లాలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. చాలా భవనాల నిర్మాణాలు, అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. రాష్ట్రమంత్రిగా ఉన్న రాయచోటి ఎమ్మెల్యే రాంప్రసాద్‌రెడ్డి ఇప్పటికైనా రాయచోటి అభివృద్ధిపై పూర్తి స్థాయిలో దృష్టి సారించి పెండింగ్ పనులన్నింటిని పూర్తి చేయించాలంటూ కోరారు. సమావేశంలో వైఎస్ఆర్‌సీపీ నేతలు బుజ్జిబాబు, శంకర్‌యాదవ్, నవాజ్‌బాషా, యూసుఫ్‌బాషలు పాల్గొన్నారు.

వైభవంగా ముగిసిన జాతర ఘట్టం

- పొలిమేర్లకు తరలిన గంగమ్మ
- లక్షమందికి పైగా పాల్గొన్న భక్తులు



గంగమ్మ ప్రతిమను ఊరేగింపుగా పొలిమేర్లకు తీసుకెళుతున్న భక్తులు

రాజంపేట టౌన్ : పట్టణంలోని బలిజపల్లె గ్రామంలో గత రెండు రోజులుగా జరిగిన గంగమ్మ జాతర వేడుకలు వైభవంగా ముగిశాయి. గత బుధవారం రాత్రి నుంచి ప్రారంభమైన జాతర వేడుక.. శుక్రవారం వేకువజామున అమ్మవారి ప్రతిమను ఊరేగింపుగా పొలిమేర్లకు సాగనంపడంతో.. ఈ ఏడాదికి జాతర ఘట్టం ఘనంగా పరిసమాప్తమైంది. గంగమ్మ ప్రతిమను భక్తులు చేతుల మీదుగా ఊరేగిస్తూ పొలిమేర్లకు తరలించారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు గంగమ్మకు ఎదురుగుంభంగా ఇష్టమైన నైవేద్యాలను సమర్పించారు. అమ్మవారి ఊరేగింపులో భాగస్వాములు అయ్యేందుకు భక్తులు పోటీపడ్డారు. ఆసాదులు దారిపొడవునా కథ చెబుతూ దీవెనలిస్తూ సాగారు. ఆసాదులు జాతర నిర్వాహకుల ఇంటి పేర్లతో, ప్రజా ప్రతినిధులు, పట్టణ ప్రముఖుల పేర్లను జోడించి చేసిన దీవెనలను, ఆసాదుల కథను వినేందుకు భక్తులు ఆసక్తిచూపారు. ఈ ఏడాది జాతరలో దాదాపు లక్ష మందికి పైగా భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నట్లు నిర్వాహకుల అంచనా.

కోటి రూపాయలకు పైగా వ్యాపారం

బలిజపల్లె గంగమ్మ జాతరను పురస్కరించుకొని వివిధ రకాల వ్యాపారాలు జోరుగా సాగాయి. వందలాది మంది భక్తులు గంగమ్మకు నైవేద్యాలుగా పొట్టేళ్లు, మేకపోతులు, కోడిపుంజులు వంటివి పెద్ద ఎత్తున సమర్పించారు. అలాగే బలిజపల్లె గ్రామంలోనే కాక పరిసర ప్రాంతాల్లో వ్యాపారులు వివిధ రకాల దుకాణాలు ఏర్పాటు చేశారు. గతంలో కంటే ఏడాది భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో అన్ని రకాల వ్యాపారాలు జోరుగా సాగాయి. దాదాపు కోటి రూపాయలకు పైగా వ్యాపారం జరిగివుంటుందని వ్యాపారులు అంటున్నారు.

పోలీసులకు భక్తులచే ప్రసంశలు

పోలీసు అధికారులు, సిబ్బంది విశేష కృషి ఫలితంగా దాదాపు రెండు రోజుల పాటు జరిగిన బలిజపల్లె గంగమ్మ జాతర ప్రశాంత వాతావరణంలో ముగిసింది. ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్ హెగ్డే ఆధ్వర్యంలో రాజంపేట అర్బన్, మన్నూరు సీఐలు, ఎస్ఐలు, వివిధ పోలీస్ స్టేషన్‌లకు చెందిన పోలీసు సిబ్బంది, ముఖ్యంగా మహిళా పోలీసులు రాత్రి వేళలో సైతం జాతర ముగిసే వరకు సర్వశక్తులు ఒడ్డి భక్తులకు ఇబ్బందులు లేకుండా అమ్మవారి దర్శనం కల్పించడంలోను, అపశ్రుతులు, అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా జాతర ప్రశాంత వాతావరణంలో ముగిసేందుకు ఎనలేని కృషి చేశారు. దీంతో భక్తులు, ప్రజల నుంచి పోలీసులకు ప్రసంశలు లభించాయి.